## మోగిన బడి గంట



నమస్తే ఎఫెక్ట్ : కరీంనగర్ కార్ఖానగడ్డ ప్రభుత్వ పాఠశాలలో ఫ్యాన్ల రెక్కలు వంగిపోయాయని ప్రచురించిన ఫొటో కథనానికి అధికారులు స్పందించారు. వెనుకాల బ్లాక్ కలర్ పాత ఫ్యాన్ రెక్కలు సరిచేయగా, ముందు భాగంలో కొత్త ఫ్యాన్ అమర్చారు.

## విదేశీ విద్యకు సిగ్ ఓవర్సీస్ సహకారం

**ఐఈఎల్‌టీఎస్, పీటీఈ, టోఫెల్, ఓఈటీ, జీఆర్ఈ, ఎస్ఏటీ శిక్షణ**

కమాన్‌చౌరస్తా, జూన్ 12: మన విద్యార్థులు విదేశాల్లో చదువుకొనేందుకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సిగ్ ఓవర్సీస్ దశాబ్ద కాలం నుంచి సహకారం అందిస్తున్నదని సంస్థ డైరెక్టర్ గంజి అభిషేక్ పేర్కొన్నారు. వేలాది విద్యార్థులకు వారి వారి అర్హతలను బట్టి వివిధ దేశాలకు తమ సంస్థ ద్వారా విజిట్ వీసా అందిస్తున్నట్టు వివరించారు. తమ వద్ద ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (కెమ్‌బ్రిడ్జ్ ఆథరైజ్డ్ లెర్నింగ్ సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్) సెంటర్ అందుబాటులో ఉన్నదని, ఇది తెలంగాణలోనే రెండోదని చెప్పారు. అందులో ఐఈఎల్‌టీఎస్, పీటీఈ, టోఫెల్, ఓఈటీ, జీఆర్ఈ, ఎస్ఏటీకి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. శిక్షణ పొందినవారి అర్హతలకు అనుగుణంగా వివిధ దేశాలకు అప్లికేషన్లు, వీసా డాక్యుమెంటేషన్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే, ఇక్కడి నుంచి విదేశాలకు పంపించిన విద్యార్థులకు అక్కడ పికప్, అకామిడేషన్ సర్వీస్ అందిస్తున్నట్టు వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు కరీంనగర్‌లోని సిగ్ ఓవర్సీస్ సర్వీసెస్ ఆఫీస్ లేదా 9885531674 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



గంజి అభిషేక్

# ఇటు బడులు.. అటు సమస్యలు

తెరుచుకున్న ప్రభుత్వ పాఠశాలలు

- తొలిరోజే అసౌకర్యాల మధ్యే విద్యార్థులు
- మెజార్టీ చోట్ల సమస్యల స్వాగతం
- నత్తనడకన 'అమ్మ ఆదర్శ పాఠశాల' పనులు
- అక్కడక్కడ చెట్ల కింద బోధన.. మధ్యాహ్న భోజనం
- సీఎం బ్రేక్‌ఫాస్ట్‌కు మంగళం
- కరీంనగర్‌లో కండ్లు తిరిగి పడిపోయిన విద్యార్థిని
- కొన్నిచోట్లే పుస్తకాలు, దుస్తుల పంపిణీ
- పలు స్కూళ్లలో పేరుకుపోయిన చెత్త
- ఇబ్బందులు పడ్డ విద్యార్థులు





వీణవంక ప్రాథమిక పాఠశాలలో తరగతి గదికి వెళ్లేదారిలో అడ్డుగా ఉన్న ఇసుకకుప్పపై నుంచి వెళ్తున్న విద్యార్థి



కరీంనగర్‌లోని కార్ఖానగడ్డ పాఠశాలలో మోగుతున్న బడి గంట

వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలు తిరిగి తెరుచుకున్నాయి. కంపు కొట్టే పరిసరాలు, వసతుల లేమి మధ్యే బుధవారం పునఃప్రారంభమయ్యాయి. పిల్లలంతా ఆటాపాటలకు టాటా చెప్పి బడిబాట పట్టగా.. మొదటి రోజు దాదాపు అంతటా సమస్యలు స్వాగతం పలికాయి. 'ఇటు తరగతులు.. అటు అసౌకర్యాలు' అన్నట్టు కనిపించగా.. విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. గత బీఆర్ఎస్ సర్కారు ప్రారంభించిన సీఎం బ్రేక్‌ఫాస్ట్‌స్కీంకు బ్రేక్ పడగా, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కార్ఖానగడ్డ ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థిని సొమ్మసిల్లి పడిపోయింది. ఇంకా ప్రారంభంరోజే పుస్తకాలు, యూనిఫాంలు ఇస్తామని ఊదరగొట్టిన యంత్రాంగం, సగం స్కూళ్లలోనే పంపిణీ చేసి చేతులు దులుపుకున్నది.



కాల్వశ్రీరాంపూర్: జాఫర్‌ఖాన్‌పేటలో డోర్లు లేని మరుగుదొడ్ల ఎదుట విద్యార్థి



సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొలిరోజు ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



గంగాధర: ఒద్యారం స్కూల్‌లో విద్యార్థులకు మంగళహారతి పట్టి స్వాగతం పలుకుతున్న టీచర్లు



కరీంనగర్: కార్ఖానగడ్డ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

రాజన్న సిరిసిల్ల, జూన్ 12 (నమస్తే తెలంగాణ): వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు బుధవారం తిరిగి తెరుచుకున్నాయి. మొదటి రోజు ఉమ్మడి జిల్లాలో మెజార్టీ చోట్ల సమస్యలే స్వాగతం పలికాయి. విద్యార్థులు తక్కువ సంఖ్యలోనే హాజరయ్యారు. విద్యార్థుల సంఖ్య అంతంతే ఉన్న అనేక చోట్ల ఒక్కరిద్దరు మాత్రమే వచ్చారు. ఉపాధ్యాయులు మాత్రం పూర్తి స్థాయిలో కనిపించారు. సగం పాఠశాలల్లో మాత్రమే యూనిఫాం దుస్తులు పంపిణీ చేశారు. కొన్ని పాఠశాలల విద్యార్థులకు మాత్రమే పాఠ్య పుస్తకాలు అందించారు. ఉదయం 9 గంటలకే ఇంటి నుంచి వచ్చిన పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ అందించకపోవడంతో ఖాళీ కడుపులతోనే విద్యార్థులు తరగతులకు వెళ్లారు. మధ్యాహ్న భోజనం మాత్రం పెట్టినా, పూర్తి స్థాయిలో అమలు కాలేదు.



శంకరపట్నం: మొలంగూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో నేలపైనే చదువులు



వీణవంక: వల్భాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల తరగతి గదిలో అస్తవ్యస్తంగా బెంచీలు

### పాఠ్య పుస్తకాలు కొందరికే



కరీంనగర్: కార్ఖానగడ్డ స్కూల్లో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

తరగతులు ప్రారంభమైన రోజునే పాఠ్య పుస్తకాలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినా కొన్ని పాఠశాలలకే పరిమితమైంది. కొన్ని పాఠశాల్లో ప్రజా ప్రతినిధులు, మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు అందించారు. కొన్ని పాఠశాలలకు పాత పుస్తకాలు అందగా, వాటిపై కేసీఆర్ ఫొటోలు ఉన్నాయని పంపిణీ చేయకుండా ఆపేసినట్లు తెలుస్తున్నది. దాదాపు అన్ని పాఠశాలల్లో స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ చేశారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో యూనిఫామ్స్ అందరికీ అందలేదు. ఏజ్ గ్రూప్ వారీగా ఒకే సైజ్‌లో కుట్టించిన యూనిఫామ్స్ కొందరు విద్యార్థుల కొలతకు సరిపోలేదు. వాటిని ఎలా వాడాలని కొందరు విద్యార్థులు ఉపాధ్యాయులను ప్రశ్నించారు. కుట్టులో కూడా నాణ్యత లేక పోవడంతో చాలా మంది పెదవి విరిచారు. యూనిఫాం దుస్తుల్లో కూడా నాణ్యత లేదని విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆరోపిస్తున్నారు.

### ఖాళీ కడుపుతోనే క్లాస్‌లకు



కరీంనగర్: కార్ఖానగడ్డ పాఠశాలలో ప్రార్థనలో సొమ్మసిల్లి పడిపోయిన విద్యార్థికి నీరు తాగిస్తున్న ఉపాధ్యాయులు

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సమయం కుదించడంతో చాలా మంది విద్యార్థులు ఖాళీ కడుపులతోనే హాజరయ్యారు. గతంలో ఎంపిక చేసిన కొన్ని పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ ఇస్తారనే నమ్మకంతో ఇంట్లో ఏమీ తినకుండానే వచ్చిన విద్యార్థులకు నిరాశే ఎదురైంది. గతంలో ఎంపికైన పాఠశాలల్లో మొదటి రోజు బ్రేక్ ఫాస్ట్ ఊసే లేదు. దీంతో ఖాళీ కడుపుతో హాజరైన విద్యార్థులు మధ్యాహ్న భోజనం వరకు ఏమీ తినకుండానే క్లాసుల్లో కూర్చుకున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కార్ఖానగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రార్థన సమయంలో ఓ విద్యార్థి కండ్లు తిరిగి పడిపోయింది. ఉపాధ్యాయులు ఆమెను పాఠశాలలోని ఓ గదిలోకి తీసుకెళ్లి నీళ్లు తాగించి కాసేపు పడుకోబెట్టారు. అక్కడక్కడ మధ్యాహ్న భోజనం వండి పెట్టారు. విద్యార్థుల సంఖ్య అంతగా లేని పలు పాఠశాలల్లో చేతులెత్తేశారు. గతంలో సీఎం బ్రేక్ ఫాస్ట్ పేరిట మండలానికి నాలుగైదు పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో ప్రతి రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించేవారు. ఇప్పుడు బ్రేక్ ఫాస్ట్ గురించి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోనట్లు తెలుస్తున్నది. గతంలో అమలైన పాఠశాలల్లోనైనా ఇది ఉంటుందా..? లేదా..? అన్న సందేహం వ్యక్తమవుతున్నది.



కరీంనగర్: కార్ఖానగడ్డ పాఠశాలలో విద్యార్థినుల మాటామంతి



పెద్దపల్లి కమాన్: పెద్దపల్లి జడ్పీ స్కూల్ ఆవరణలో నిలిచిన నీరు

### అపరిశుభ్రంగా పాఠశాలలు

50 రోజుల సెలవుల తర్వాత బుధవారం స్కూల్ రీ ఓపెన్ కాగా, చాలా పాఠశాలల్లో చెత్తాచెదారం, అపరిశుభ్రత కనిపించింది. తరగతి గదులు, పరిసరాలను శుభ్రం చేసే సిబ్బంది లేకపోవడం వల్లే ఈ దుస్థితి వచ్చింది. పెద్దపల్లి జడ్పీ బాలుర పాఠశాల మైదానంలో వర్షపు నీరు నిలిచి అధ్వానంగా కనిపించింది. ఇక మూత్రశాలలు, మరుగుదొడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. నిర్వహణ లేక ఎక్కడ చూసినా కనీసం ఉపయోగించలేని స్థితిలో ఉన్నాయి. 'అమ్మ ఆదర్శ పాఠశాలల' పేరిట కొత్త పథకాన్ని తెచ్చి ఆధునీకరణ, మరమ్మతు పనులు చేపట్టినా అవి నత్తనడకన సాగుతుండడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. వేసవి సెలవుల్లో పనులు పూర్తి కాకపోవడంతో ఓ వైపు పనులు, మరో వైపు తరగతుల నిర్వహణ విద్యార్థుల చదువుకు ఆటంకంగా మారింది. దాదాపు అనేక చోట్ల పిల్లలు చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇక మెజార్టీ చోట్ల కనీసం గంట కొట్టేందుకు అటెండర్ల దిక్కు కూడా లేకపోయింది. ప్రభుత్వం స్పందించి అటెండర్ల స్థానంలో కనీసం స్కావెంజర్లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



కోరుట్ల: బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో నేలపై కూర్చొని భోజనం చేస్తున్న విదార్థినులు

### ప్రవేశాలు అంతంతే

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలనే ఉద్దేశంతో జూన్ 6 నుంచి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించినా, అది మొక్కుబడిగానే సాగిందనే విమర్శలు వస్తున్నాయి. కరీంనగర్ జిల్లాలో చూస్తే మంగళవారం వరకు 64 మంది విద్యార్థులే చేరారు. ఈ కార్యక్రమం ఈ నెల 19వ తేదీ వరకు ఉన్నా, కొత్తగా పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందనే ఆలోచన ఉన్నతాధికారుల్లో లేకుండా పోయింది.



వీణవంక:నర్సింగాపూర్ స్కూల్లో బెంచీని ఎత్తుకొని గదిలోకి వెళ్తున్న విద్యార్థి



హైదరాబాద్‌లోని తన నివాసంలో అర్బన్ బ్యాంక్ పాలకవర్గ సభ్యులను అభినందిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్

## ఖాతాదారులకు మెరుగైన సేవలందించండి

**మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ • అర్బన్ బ్యాంక్ నూతన పాలకవర్గానికి సన్మానం**

రాజన్న సిరిసిల్ల, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని అర్బన్ బ్యాంక్ పాలకవర్గానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నిర్దేశం చేశారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు బుధవారం బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు వెళ్లి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులను కేటీఆర్ సన్మానించి, అభినందించారు. అనంతరం మాట్లాడుతూ, సిరిసిల్ల ప్రాంత ప్రజలకు సేవలందించడంలో బ్యాంక్ మంచిపేరు తెచ్చుకున్నదని, ఆ పేరును చిరస్థాయిగా కొనసాగించాలని సూచించారు. పార్టీపై నమ్మకం, తమపై ఉన్న అభిమానంతో మూడు సార్లు పార్టీ అభ్యర్థులను గెలిపించి.. బ్యాంక్‌పై గులాబీ జెండా ఎగిరేలా చేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. శాసనసభ్యుడిగా తాను బ్యాంక్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళీ, సభ్యులు సంజీవ్, సుక్కవ్వ, కుమార్‌రాజు, దేవదాస్, హర్షిణి, సత్యానందం, రాజు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సీనియర్ నాయకులు బొల్లి రామ్మోహన్, గుండ్లపల్లి పూర్ణచందర్, మ్యాన రవి, అగ్గిరాములు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపాలనలో చేసిన దరఖాస్తుల్లో మార్పుల కోసం క్యూ లైన్లో నగరవాసులు

## 'గ్యారెంటీ'ల కోసం బారులు

కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 12: కాంగ్రెస్ అధికారం చేపట్టి ఆరు నెలలు దాటినా అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు అందలేదు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా సర్కారు అమల్లోకి తెచ్చిన రెండు పథకాలు వర్తించలేదు. ఇన్ని రోజులు పార్లమెంట్ ఎన్నికల కోడ్‌తో ఆగినా.. ఈ నెల 6న కోడ్ ముగియడంతో మళ్లీ స్కీంల కోసం పంచాయతీ, మున్సిపల్ ఆఫీసులకు పరుగెడుతున్నారు. బుధవారం కరీంనగర్ బల్దియాలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద గ్యాస్ కనెక్షన్, కరెంట్ మీటర్ల నంబర్లను లింక్ చేసుకొనేందుకు అర్జీదారులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. గంటల తరబడి క్యూలైన్లలో నిల్చుండి అవస్థలు పడ్డారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక..

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571